బతుకమ్మ వేడుకలు షురూ

శేరిలింగంపల్లిజోన్ బృందం: బతుకమ్మ వేడుకలు శేరిలింగంపల్లి జంట సర్కిళ్ళ పరిధిలో శనివారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. పలువురు మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో ఆకట్టుకున్నారు. తారానగర్, లింగంపల్లి, మదీనాగూడ, హఫీజ్‌పేట్, శుభోదయ కాలనీలలో వేడుకలు ప్రారంభమయ్యాయి.


తారానగర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


శిల్పారామంలో...


శుభోదయకాలనీలో బతుకమ్మ వేడుకల్లో మహిళలు


మదీనాగూడలో బతుకమ్మలతో మహిళలు


నల్లగండ్ల హుడా రెసిడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

అభివృద్ధి జరగాలంటే బీజేపీని గెలిపించాలి

- పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవికుమార్‌యాదవ్
- శేరిలింగంపల్లి డివిజన్‌లో గడపగడపకూ బీజేపీ కార్యక్రమం


శేరిలింగంపల్లి డివిజన్‌లో పర్యటిస్తున్న నాయకుడు రవికుమార్‌యాదవ్

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలో అభివృద్ధి జరగాలన్నా, సమస్యలు తీరాలన్నా బీజేపీని గెలిపించాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవికుమార్‌యాదవ్ ప్రజలను కోరారు. శేరిలింగంపల్లి డివిజన్‌లోని సుదర్శన్‌నగర్, ఆలిండ్ సొసైటీ, భాగ్యలక్ష్మీనగర్ కాలనీలో గడపగడపకూ బీజేపీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ పార్టీ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సుదర్శన్‌నగర్, భాగ్యలక్ష్మీనగర్ కాలనీ, ఆలిండ్ సొసైటీలలో రోడ్లు, డ్రైనేజీ పార్కు, మంజీరా పైప్‌లైన్ వంటి అభివృద్ధి పనులన్నీ భిక్షపతియాదవ్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే చేశారన్నారు. పదేళ్ళు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు పట్టించుకోలేదని, బీజేపీకి అవకాశం ఇస్తే ప్రజలు ఆశించిన మేరకు అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎల్లేష్, అనిల్‌కుమార్ యాదవ్, రమేష్, మురళీధర్, రామ్మోహన్, ప్రవీణ్, దేవేందర్, రత్నయ్య, గండయ్య, వెంకటేష్, సురేష్ పాల్గొన్నారు.

నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

రాయదుర్గం: విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని గచ్చిబౌలి డివిజన్‌లో శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. గచ్చిబౌలి జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వర స్వామి ఆలయం, గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంతోపాటు రాయదుర్గం, ఇతర ప్రాంతాలలో ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

నేడు అన్నపూర్ణ అలంకారం

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని గచ్చిబౌలిలోని శివసాయి క్షేత్రంలో ఆదివారం అన్నపూర్ణాదేవిగా దర్శనమిస్తారు. ఉదయం ఆలయంలో గణపతి పూజతో ఈ ఉత్సవాలను ప్రారంభిస్తారు. అనంతరం చండీ హోమం, చండీపారాయణం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తారు.

పండగలపై విద్యార్థులకు అవగాహన

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీలోని ఎస్ఎస్‌డి గ్రామర్ హైస్కూలులో శనివారం దసరా,బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. చెడుపై సాధించిన విజయానికి ప్రతీకగా చేసుకునే ఈ పండుగ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఉపాధ్యాయులు విద్యార్థులతో నాటక, నృత్య ప్రదర్శన నిర్వహించారు.కార్యక్రమంలో డైరెక్టర్ సురభి రవీందర్‌రావు, సురభి దుర్గావాణి, చెన్నమనేని స్రవంతి, సురభి తేజశ్విని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలి



జిన్నారం(పటాన్‌చెరు): తపాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సంగారెడ్డి డివిజన్ తపాలాశాఖ అధికారి సంపత్‌రెడ్డి సూచించారు. గుమ్మడిదల గ్రామంలో తపాలా వారోత్సవాల్లో భాగంగా ప్రజలకు సేవలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సంపత్‌రెడ్డి మాట్లాడుతూ నేషనల్ పోస్టల్ వీక్ ముగింపు ఉత్సవాల్లో భాగంగా పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలను ప్రజలకు వివరిస్తున్నామన్నారు. ప్రత్యేక పాలసీలు అందుబాటులో ఉన్నాయన్నారు. పోస్టల్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విరాళం అందజేత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భెల్ టౌన్‌షిప్‌లో గల అభిలాష ఒకేషనల్ సెంటర్‌లో వీఎఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధ్వర్యంలో శనివారం భారతీనగర్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి కుమారుడు జైవీర్ రెడ్డి జన్మదినం సందర్భంగా సుమారు 80 మంది అంగవైకల్యం పిల్లలకి యూనిఫాంలకు సంబంధించి నగదును చెక్కు రూపంలో అందజేశారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ...ఒకేషనల్ సెంటర్‌లో అంగవైకల్యం పిల్లలు తయారు చేసిన వస్తువులు పరిశీలించారు.అలాగే క్లాస్‌రూం మరమ్మతుల పనులు చేయిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమానికి వీఎఆర్‌ట్రస్ట్ చైర్మన్ ఆదర్శ్ రెడ్డి ,ప్రిన్సిపల్ సరస్వతి, సత్యవతి, వినోద్, సరోజ్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన మోడల్స్ ర్యాంప్‌వాక్


లెమన్‌ట్రీ హోటల్‌లో నిర్వహించిన ఆడిషన్స్‌లో పాల్గొన్న మోడల్స్



మాదాపూర్: మోడల్స్ ర్యాంప్‌పై క్యాట్‌వాక్ చేసి అలరించారు. మాదాపూర్‌లోని లెమన్ ట్రీ హోటల్‌లో శనివారం విండో ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్వహిస్తున్న మిస్ అండ్ మిసెస్ గోల్డెన్ ఫేస్ ఆఫ్ సౌత్ ఇండియా- 2023 కాంటెస్ట్‌ను నిర్వహించారు. యాసిడ్ దాడి బాధిత మహిళలకు చర్మదానంపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమం అని వ్యవస్థాపకులు, మేనేజింగ్ డైరెక్టర్ గోపినా రవి, శరవణన్ తెలిపారు. చెన్నై, బెంగుళూరు, కొచ్చికి సంబంధించిన ఆడిషన్స్ పూర్తయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో సినీనటులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలి

హెచ్‌సీయూ ప్రొ.నాగరాజు


అబ్దుల్ కలామ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ప్రొ.నాగరాజు తదితరులు

రాయదుర్గం: విద్యార్థులు రోల్ మోడల్‌గా మారాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ జి నాగరాజు సూచించారు. ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ టి రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో ప్రపంచ విద్యార్థి దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం గోపన్‌పల్లిలోని జవహర్ నవోదయ విద్యాలయ రంగారెడ్డిజిల్లా ప్రాంగణంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్ కలామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్ననాటి నుంచి విద్య పట్ల బలమైన నిబద్ధతతో ఉండటం అనే అలవాటు ఆయనను విద్యావేత్తగా మార్చిందన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో గుణాత్మకమైన విద్యను అందిపుచ్చుకోవాలని సూచించారు. జేఎన్‌వి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ఎంఎస్ మైత్రి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు విష్ణుప్రసాద్, జనార్దన్, బాలన్న, అమ్మయ్యచౌదరి జేఎన్‌వి అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీలు ముమ్మరం...

- ఇద్దరి నుండి 2 లక్షల 87 వేలు నగదు పట్టివేత

పటాన్‌చెరు టౌన్: ఎన్నికల కోడ్ సందర్భంగా పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. పటాన్‌చెరు పట్టణంలోని పాత టోల్‌గేట్ సమీపంలో శనివారం పటాన్‌చెరు పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు.ఈ తనిఖీల్లో నిజాంపేట్‌కు చెందిన శ్రీనివాసులురెడ్డి అనే వ్యక్తి నుండి రూ.87 వేలు, సికింద్రాబాద్‌కి చెందిన ముఖేశ్ అనే వ్యక్తి వద్ద 2 లక్షల నగదు పట్టుకున్నారు.ఈ తనిఖీలో పటాన్‌చెరు ట్రాఫిక్ సిఐ ప్రవీణ్‌రెడ్డి, క్రైమ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

- అమీన్‌పూర్ సీఐ శ్రీనివాసులురెడ్డి

పటాన్‌చెరు: బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అమీన్‌పూర్ సిఐ శ్రీనివాసులు రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కిష్టారెడ్డి పేటలో రవీందర్ అనే వ్యక్తి కిరాణాషాప్‌లో, అదేవిధంగా పటేల్‌గూడెంలో విక్రమ్‌కుమార్ అనే వ్యక్తి కిరాణాషాప్‌లో మద్యం విక్రయాలు చేస్తున్నారనే విశ్వసనీయ సమాచారం అందడంతో శనివారం పోలీసులు దాడులు నిర్వహించి రూ.15 వేలు విలువ చేసే మద్యంను స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేశారు.

హెచ్‌బీసీ గచ్చిబౌలి- గోల్కొండ సైకిల్ రైడ్


హెచ్‌బీసీ నుంచి బయల్దేరిన రైడర్లు

రాయదుర్గం: గచ్చిబౌలిలోని హెచ్‌బీసీ బైసైకిల్ స్టేషన్ నుంచి శనివారం ఉదయం 30 మంది సైకిల్ రైడర్లు పాల్గొన్నారు. గచ్చిబౌలి బైసైకిల్ స్టేషన్ నుంచి లంగర్‌హౌజ్ మీదుగా గోల్కొండ వరకు సైకిల్ రైడ్ ను నిర్వహించారు. గోల్కొండ కోటను 20 నిమిషాల్లో ఎక్కడం విశేషం. అక్కడ కొద్ది సేపు సేద తీరి ఆతర్వాత అదే మార్గంలో తిరిగి గచ్చిబౌలిలోని హెచ్‌బీసీ వరకు రైడ్‌ను కొనసాగించారు. ఈ సందర్భంగా భారతదేశపు జాతీయ పతాకాన్ని ప్రదర్శించారు.

కనువిందు.. నృత్య ప్రదర్శనలు





మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న ఆలిండియా శారీ మేళాకు శనివారం సెలవురోజు కావడంతో నగరవాసులు పోటెత్తారు. బెంగాలీ కాటన్, పెయింటింగ్ చీరలు, గద్వాల్, చందేరీ, ఉప్పాడ పట్టు, నారాయణపేట, గొల్లభామ చీరలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. శిల్పారామం ఆవరణలో సిబ్బంది బతుకమ్మ పాటలతో అలరించారు. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా మైథిలి అనూప్ బృందంచే మోహినియట్టం ప్రదర్శించారు. ఇందులో దేవిస్తుతి, కీర్తనం, చోలకేత్తు, జయదేవకి కిశోర అంశాలను ప్రదర్శించారు. కూచిపూడి నృత్యప్రదర్శనలో భాగంగా ప్రొఫెసర్ భాగవతుల సేతురాం శిష్యబృందం ఓంకారకారిని, శృంగారలహరి తదితర అంశాలను ప్రదర్శించారు.

అన్నమయ్యపురంలో..

మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో శనివారం అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా నృత్యాంజలి డ్యాన్స్ ఇనిస్టిట్యూట్ గురువు ప్రసన్నమోహన్ శిష్యబృందం భరతనాట్య నృత్యార్చన నిర్వహించారు. కళాకారులు శ్రీప్రియ, వైష్ణవి, వర్ష, పియూష్, గౌరి, జగదీస్, ఆరాధ్య, జోషిత తదితరులు అలరించారు.



స్విగ్గి డెలివరీ బాయ్‌పై దాడి

- తీవ్ర గాయాలు, ఆసుపత్రికి తరలింపు


గాయపడ్డ డెలివరీ బాయ్

హఫీజ్‌పేట్ : స్విగ్గి డెలివరీ బాయ్‌పై దాడి చేసి సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ నాగేశ్వర్‌రావు తెలిపిన ప్రకారం వివరాలు.. మధ్యప్రదేశ్ రాష్ట్రం శివాని జిల్లాకు చెందిన పి.అలోక్‌కుమార్ (27) గోపన్‌పల్లితండాలో నివాసముంటూ స్విగ్గి డెలివరీ బాయ్‌గా చేస్తున్నాడు. శనివారం తెల్లవారుజామున గచ్చిబౌలి ఏరియాలో డెలివరీ చేస్తుండగా నల్లగండ్లలోని అపర్ణ సరోవర్ జినిత్ అపార్ట్‌మెంట్ నుంచి ఆర్డర్ రావడంతో తెల్లవారుజామున 3 గంటలకు నల్లగండ్లకు వచ్చి ఫుడ్ డెలివరీ చేసి పక్కనే ఉన్న బస్టాప్‌లో కూర్చున్నాడు. ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు బస్టాప్‌కు కొద్ది దూరంలో బైక్ నిలిపి స్విగ్గి డెలివరీ బాయ్ వద్దకు వచ్చి సెల్‌ఫోన్ ఇవ్వాలంటూ బెదిరించారు. అతను ఇవ్వకపోవడంతో వెంటనే కత్తితో దాడి చేసి స్విగ్గి డెలివరీ బాయ్ వద్ద ఉన్న సెల్‌ఫోన్, పర్సు, బ్యాగును లాక్కొని గోపన్‌పల్లి వైపు పారిపోయారు. తీవ్ర గాయాలపాలైన అలోక్‌కుమార్ కొద్దిసేపు తరువాత 100కు డయల్ చేయగా వెంటనే చందానగర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గాయపడ్డ డెలివరీ బాయ్‌ను చికిత్స కోసం పోలీసులు పక్కనే ఉన్న సిటిజన్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దాడి చేసిన వారి కోసం సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.